సాక్షి కర్నూలు
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



అన్నప్రసాదానికి విరాళం


శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహించే అన్నప్రసాద పథకానికి శనివారం రంగారెడ్డి జిల్లా మల్కాజ్‌గిరికి చెందిన వివేక్ కుటుంబీకులతో కలిసి రూ.లక్ష విరాళం అందించారు.



ఇంటి వద్ద పింఛన్ ఒట్టిదే!

ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ పేరుకు మాత్రమే. పింఛన్ సొమ్మును అందించేందుకు సచివాలయ ఉద్యోగులెవ్వరూ ఇంటి వద్దకు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

11లో



ఒక్క రోజు రూ. 3.19 లక్షలు

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన లక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజే భక్తులు వివిధ సేవలు నిర్వహించుకోవడంతో రూ.3,19,430 ఆదాయం వచ్చింది.

న్యూస్‌రీల్

ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు

- డీఈఓ శామ్యూల్ పాల్



మాట్లాడుతున్న డీఈఓ శామ్యూల్ పాల్

ఎమ్మిగనూరుటౌన్: పరీక్షల భయం వీడి ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం పట్టణంలోని మాచాని సోమప్ప బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్యను హెచ్‌ఎం కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థినిలతో పరీక్షలపై సమావేశాన్ని నిర్వహించి సూచనలు చేశారు. ఒక లక్ష్యాన్ని పెట్టుకొని చదివి పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో 1:25 రేషియోలో ఉపాధ్యాయులు వుండేలా చర్యలు తీసుకొని విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఆదోని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, ఎంఈఓలు ఆంజినేయులు, మధుసూదన్‌రాజు పాల్గొన్నారు.

అలారు దిన్నె బ్రిడ్జిపై రాకపోకలు బంద్

కర్నూలు న్యూసిటీ: జిల్లా కేంద్రం నుంచి బళ్లారి వెళ్లే మార్గంలో అలారు దిన్నె గ్రామం వద్ద ఉన్న బ్రిడ్జి దెబ్బతినడంతో నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు నిషేధించినట్లు రోడ్లు, భవనాల శాఖ డీఈఈ సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి, ఆలూరు నుంచి కర్నూలు వైపు వచ్చే వాహనాలను ఆస్పరి, పత్తికొండ, దేవనకొండ మీదుగా మళ్లించినట్లు వివరించారు. కర్నూలు నుంచి ఆలూరు, బళ్లారి వైపు వెళ్లే వాహనాలను దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి మీదుగా మళ్లించినట్లు వెల్లడించారు. త్వరలో బ్రిడ్జి మరమ్మతులు పూర్తి చేసి వాహనాల రాకపోకలు పునరుద్ధరిస్తామని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ కర్నూలు బ్రాంచ్ మేనేజర్ రాజీవ్ రైతులకు సూచించారు. శనివారం కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని డీసీఎంఎస్ కార్యాలయంలో కందుల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. కందుల నాణ్యతను కూడ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కర్నూలు, కల్లూరు, గూడూరు మండలాల్లో డీసీఎంఎస్ ద్వారా కొనుగోళ్లు చేస్తామని వివరించారు. కందులకు మద్దతు ధర రూ.7550 ఉందని, రైతులు తగిన నాణ్యతా ప్రమాణాలతో తెస్తే మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు. ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం తేమ 12 శాతం లోపు ఉండాలని సూచించారు.

నేడు వసంత పంచమి

- కొలను భారతిలో ఏర్పాట్లు పూర్తి



ముస్తాబైన కొలనుభారతి దేవి ఆలయం

కొత్తపల్లి: సరస్వతి దేవి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొలనుభారతి దేవి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వెంకట నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. చిన్నారులకు ఇక్కడ అక్షరాభ్యాసం చేయించేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, అక్షరాభ్యాస స్థలం, భక్తులు సేదతీరేందుకు టెంట్లు, భోజన, తాగునీటి సౌకర్యం, మహిళా భక్తులు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: ఈ నెల 19 నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, క్యూలు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లడ్డూ కౌంటర్ వద్ద ప్రస్తుతం ఉన్న 15 కేంద్రాలతో పాటు అదనంగా మరో 8కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేకంగా క్యూలైన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద తగినన్ని సూచికబోర్డులను ఏర్పాటు చేయాలన్నారు.

ధైర్యంగా ఉండండి.. భవిష్యత్తు మనదే

- 8 నెలలకే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో తీవ్ర అసంతృప్తి
- త్వరలోనే జగనన్న జిల్లాల పర్యటనలు
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- ఆర్భాటంగా పార్టీ నేతల ప్రమాణ స్వీకారం



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తూ..



నాయకులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ, పార్టీ నేతలు

కర్నూలు (టౌన్): 'ధైర్యంగా ఉండండి. భవిష్యత్తు మనదే. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా.. కూటమి ప్రభుత్వం ఇంటికే' అని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాలులో జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి అధ్యక్షతన ఇటీవల పార్టీలో పదవులు దక్కిన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల కన్వీనర్లు, అధికార ప్రతినిధులు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లు, అనుబంధ సంఘాల నేతల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించారు. పదవులు దక్కిన వారందరిని రీజినల్ కో ఆర్డినేటర్ శాలువాతో సత్కరించారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు కంగాటి శ్రీదేవి, కాట సాని రాంభూపాల్ రెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి, కేడీసీసీ మాజీ చైర్ పర్సన్ విజయ మనోహరి, పార్టీ నేతలు ప్రదీప్ రెడ్డి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్, జగన్‌మోహన్ రెడ్డి, అహమ్మద్ అలీఖాన్, శశికళ, నీలకంఠ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తెర్నెకల్ సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా వైఎస్సార్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమం పార్టీ నేతల్లో జోష్ నింపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్ది రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి వైఎస్సార్‌సీపీలో సముచిత గౌరవం ఉంటుందన్నారు. పదవులు దక్కిన వారంతా పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేయాలన్నారు. కలిసి కట్టుగా అందరం జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. వైఎస్సార్‌సీపీకి రాష్ట్రంలో 40 శాతం ఓట్లు ఉన్నాయని, అదికాస్తా ఇంకా పెరగడం ఖాయమన్నారు. ఎమినిది నెలలుగా కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడుదామని పిలుపు నిచ్చారు. త్వరలో జగనన్న జిల్లాల పర్యటనలు ఉంటాయన్నారు. సీఎంగా జగనన్న సంక్షే మ క్యాలెండర్ రూపొందించి ప్రతి ఏడాది చెప్పిన పథకాలు అమలు చేశారన్నారు. రూపాయి కూడా లంచం లేకుండా ఇంటింటికీ నవరత్నాలను చేర్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వానికి పేదల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కొండంత హామీలు ఇచ్చి గోరంత కూడా అమలు చేయలేదని విమర్శించారు.



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పదవులు అలంకార ప్రాయం కాకూడదు..

పార్టీ కోసం పనిచేసే వారికి ప్రత్యేకంగా గుర్తింపు ఇవ్వాలని జగనన్న నిర్ణయించారని, పదవులు అలంకార ప్రాయంగా కాకూడదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి అన్నారు. ఈ పదవులు ఎవరిపై పెత్తనం ఉండకూడదని, ప్రజలకు అండగా ఉందామన్నారు. మరోసారి జగనన్నను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఇప్పటి నుంచే పని చేద్దామని పిలుపు నిచ్చారు. ప్రత్యర్థులు ఇబ్బందులు సృష్టిస్తే వారి పేర్లను గుర్తు పెట్టుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో చంద్రబాబు చేతులెత్తేశారన్నారు. పోస్టు కోసం ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేసేంత వరకు తెలుగుదేశం పార్టీ నేతలు దిగజారారని విమర్శించారు. హామీలు అమలు చేయకుంటే కాలర్ పట్టుకోవాలన్న నారా లోకేష్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. తిరుపతి తొక్కిసలాట బాధితుల పరామర్శకు జగనన్న రాకుండా పవన్ కళ్యాణ్, ప్రభుత్వం ఎన్నో కుట్రలు చేసిందన్నారు. అయినా ప్రజాభిమానం ఉన్న నాయకుడు జగన్ అక్కడికి వెళ్లి వారిని పరామర్శించారన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి

కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఎనిమిది నెలల్లోనే నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ఈనెల 5వ తేదీ కర్నూలులో చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరును విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గతేడాది నుంచే అమలు చేయాలి



కేంద్ర బడ్జెట్‌లో పన్ను మినహాయింపులను స్వాగతిస్తున్నాం. రూ.12.75 లక్షల వరకు పన్ను లేకుండాచేయడం మంచి పరిణామం. అయితే సవరించిన పన్నును 2025-26 నుంచి కాకుండా 2024-25 ఆర్థిక సంవత్సరంనుంచే వర్తింపజేయాలి.
– వెంగళరెడ్డి, ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు

తీవ్ర అన్యాయం



బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగింది. విశ్వవిద్యాలయాలకు నిధులు లేవు. కర్నూలు రైల్వే ప్రాజెక్టుల ప్రస్తావనే లేదు. ఎయిర్‌పోర్టు అభివృద్ధికి నిధులు ఇవ్వలేదు. ఇది ప్రాంతీయ అసమానతలకు దారి తీస్తుంది. – మన్సూర్ రెహమాన్, రిటైర్డ్ ఎకనామిక్ ప్రొఫెసర్, కర్నూలు

అంకెల గారడీ



బడ్జెట్ కేవలం అంకెల గారడి. సామాన్య ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపడని బడ్జెట్ ఇది. ఎన్నికలు ఉన్న బిహార్, ఢిల్లీల కోసమే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. రాయలసీమ, ఉత్తరాంధ్రల అభివృద్ధి, రైతులకు కనీస మద్దతు ధరలపై నిర్ణయాలే లేవు. – బి.గిడ్డయ్య, జిల్లా కార్యదర్శి, సీపీఐ

ప్చ్.. ఉపయోగం లేదు!

- కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజల పెదవి విరుపు
- ప్రకటనకే పరిమితమైన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్
- కర్నూలు నుంచి అమరావతికి రైలు లేదు..పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు లేవు
- నిరుత్సాహం వ్యక్తం చేసిన వివిధ పార్టీల నాయకులు



పన్ను నుంచి మినహాయింపు

- కర్నూలు జిల్లాలో ట్రెజరీ ద్వారా 28,895 మంది, కార్పొరేషన్ల ద్వారా 5 వేల మంది ఉద్యోగులు జీతాలు తీసుకుంటున్నారు. రూ.12.75 లక్షల వరకు పన్ను నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వడం వీరికి ఊరట ఇస్తోంది.
- అర్బన్ లాంచ్ ప్రోగ్రామ్ కింద పట్టణాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.లక్ష కోట్లను కేటాయించారు. ఈపథకం కింద స్మార్ట్ సిటీల కింద ఎంపికైన కర్నూలు, ఆదోని పట్టణాల్లో తాగునీరు, పారిశుద్ధ్య వసతులను మెరుగు పరచేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- పత్తి ఉత్పాదను పెంచేందుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక మిషన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలపడంతో జిల్లాలోని 6,20,658 మంది రైతులకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.
- జిల్లాకు ఒక క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేశ వ్యాప్తంగా 75 వేల మెడికల్ సీట్లను వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కర్నూలు, నంద్యాల జిల్లా ప్రజలు పెదవి విరిచారు. ఎలాంటి ఉపయోగం లేదని విమర్శించారు. బడ్జెట్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధికి ఆయువుగా భావిస్తున్న ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతులు కల్పించేందుకు పైసా విదల్చలేదు. కర్నూలు నుంచి అమరావతికి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును వేయలేదు. పెండింగ్ రైల్వే ప్రాజెక్టులు, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమల వృద్ధి కోసం ఎలాంటి నిధులను కేటాయించలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమే ఉన్నా నిధులను సాధించడంలో విఫలమైందని ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కమ్యూనిస్టులు, ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధర నిధుల కేటాయింపు చేపట్టలేదని ఆరోపించారు. కార్మికులకు, నిరుద్యోగులకు అన్యాయం చేసే విధంగా బడ్జెట్ ఉందని విమర్శించారు.

ఉద్యోగ అవకాశాలు మృగ్యం

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో 2,600 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేస్తామని 2024 జూన్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయితే ప్రస్తుత బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. కారిడార్ వృద్ధి పథంలోకి వస్తే ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 లక్షలకుపైగా ఉన్న యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చే అవకాశం ఉంది.

వినతులు బుట్టదాఖలు

కర్నూలు నుంచి విజయవాడకు రైలును నడపాలని మంత్రి టీజీ భరత్..రైల్వే మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. అలాగే కర్నూలు ఎంపీ బస్తిపాటినాగరాజు కూడా రైల్వే మంత్రిని పలుమార్లు అభ్యర్థించారు. అయితే వారి విన్నపాలను రైల్వే శాఖ పట్టించుకోనట్లుగా ఉంది. మంత్రాలయం మార్గం, రిహబులిటీ వర్క్‌షాపునకు నిధులు కేటాయించలేదు.

పేదలకు లాభం లేదు



కేంద్రలో, రాష్ట్రంలో కూటమి సర్కార్‌లే ఉన్నా సాధించింది సున్నా. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ప్రస్తావన లేదు. కర్నూలు నుంచి అమరావతికి రైలు లేదు. ఈ బడ్జెట్‌తో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఏమి లాభం లేదు. బడ్జెట్ సవరణలో ఏపీకి నిధులపై ఎంపీలు పోరాటం చేయాలి.
– ఎస్వీ మోహన్‌రెడ్డి,జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

'కూటమి' నేతల విఫలం



కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి, కర్నూలుకు నిధులు సాధించడంలో 'కూటమి' నేతలు విఫలమయ్యారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. రైల్వే ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రిక్తహస్తం చూపారు. ఈబడ్జెట్‌తో ఉపయోగం లేదు. – కె.ప్రభాకరరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కర్నూలు

పోరాటం చేయాలి



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్య ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదు. కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్‌కు, రైల్వే ప్రాజెక్టులకు నిధులు లేవు. బడ్జెట్‌లో న్యాయం వచ్చేలా టీడీపీ ఎంపీలు పోరాటం చేయాలి.
– పి.మురళీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు, కర్నూలు

శ్రీకరం.. శుభకరం

గణపతి, కలశ పూజ నిర్వహిస్తున్న పండితులు



- శాస్త్రోక్తంగా ఉరుకుంద క్షేత్ర కుంభాభిషేకానికి అంకురార్పణ

మంత్రాలయం/కౌతాళం: అణువణువునా వేదం పలికింది. తనువుతనువు ఈరన్న స్మరణ పఠించింది. ఈరన్న శరణు ఘోషతో ఉరుకుంద క్షేత్రం పరవశించింది. శ్రీకర శుభకర ప్రణవ స్వరూపుడు ఉరుకుంద ఈరన్న స్వామి కుంభాభిషేక ఘట్టానికి మొదటి రోజు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ఆధ్వర్యంలో శనివారం కుంభాభిషేక వేడుక ప్రారంభమైంది. ఆలయ పండితులు, అధికారులు కలశాలతో ఊరేగింపుగా మంగళవాయిద్యాలతో యాగశాల ప్రవేశం చేశారు. యాగశాలలో శైవాగమ శాస్త్ర ప్రవీణ సుబ్రహ్మణ్య స్వామి ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, గోమాత, గణపతి పూజోత్సవాలు వైభవంగా చేపట్టారు. దీక్షారాధన, త్రిశూల పూజలు అనంతరం ప్రసాద వితరణ చేశారు. కుంభాభిషేక నిమిత్తం దేశంలోని సప్త నదుల నుంచి తెచ్చిన పవిత్ర జలాలను యాగశాలకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. పుణ్యాహవాచనంలో ప్రముఖ సిద్ధాంతి సీతారామానుజ ప్రసాద్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్.రాఘవేంద్రరెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి, డివిజన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్లు వెంకటేశ్వర రావు, మల్లికార్జున,ప్రధాన అర్చకుడు ఈరన్న పాల్గొన్నారు.




కలశాలను యాగశాలకు చేర్చుతున్న దృశ్యం

శాస్త్రోక్తంగా కలాపకర్షణ

కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా చేపట్టిన కలాపకర్షణ వేడుక శాస్త్రోక్తంగా సాగింది. విమాన రాజగోపురం శిఖరాగ్రానికి చేరుకుని కలాపకర్షణ క్రతువు కానిచ్చారు. వేద పఠనం గావిస్తూ జీర్ణోద్ధరణలో భాగంగా గోపురంపై పాత కలశాలను తొలగించారు. ఈరన్న స్వామి శక్తి స్వరూపాలుగా వర్ధిల్లిన కలశాల శక్తిని నూతన కలశంలోకి ఆవాహం గావించి కలాపకర్షణ చేపట్టారు. ఈ క్రతులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే యాగమంటపంలో నలుదిశలా రుగ్వేద, అధర్వణ వేద, శ్రీకృష్ణ రుగ్వేద, శుక్ల రుగ్వేద పఠన గావించారు. వేద పఠనతో క్షేత్రమంతా మార్మోగింది.

ప్రజలకు అందుబాటులో ఉంటా

- జిల్లా నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న విక్రాంత్ పాటిల్

కర్నూలు: 'ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పటిష్ట చర్యలు చేపడతా. మహిళలు, చిన్నపిల్లల పట్ల జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారిస్తా' అని జిల్లా నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఇటీవల జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా ఇక్కడున్న బిందుమాధవ్ కాకినాడకు, అక్కడున్న విక్రాంత్ పాటిల్ కర్నూలుకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో 55వ ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. డీపీఓ చేరుకోగానే పోలీసుల గౌరవ వందనం స్వీకరించి పొరోహితుల ఆశీస్సులు అందుకున్నారు. 2012 బ్యాచ్ సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన విక్రాంత్ పాటిల్ తమిళనాడు రాష్ట్రం కేడర్‌కు ఎంపికైన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం వ్యాస్ ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో నూతన ఎస్పీ పాల్గొని విధి నిర్వహణలో తన ప్రాధాన్యతలను వివరించారు. ఆయన మాటల్లోనే..'సైబర్ నేరాలు ఇటీవల పెరిగిపోతున్నాయి. వాటి నివారణకు గట్టి చర్యలు తీసుకుంటాం. సైబర్ నేరాలను ఛేదించడం, కట్టడితో పాటు వాటి నివారణకు అవగాహన కార్యక్రమాలు జిల్లా అంతటా విస్తృతం చేస్తాం. సైబర్ మోసాలపై వీడియో క్లిప్పింగులను కళాశాల, పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, మీడియా ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తాం. సైబర్ నేరాల నివారణ, పోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. నేర రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి గ్రామంలో, పట్టణంలో సీఎస్ఆర్ నిధులతో సీసీ కెమెరాల నిఘాను పెంచుతాం. నేరాల నివారణకు జిల్లా పోలీసు శాఖకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలి'అని విజ్ఞప్తి చేశారు. సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది నూతన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలసి మొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగ ప్రస్థానం...

ఎస్పీ విక్రాంత్ పాటిల్ 2016లో తుల్లూరులో ఏఎస్పీగా, 2017లో పార్వతీపురం ఓఎస్డీగా పనిచేసి ఎస్పీగా పదోన్నతి పొందారు. 2018లో చిత్తూరు జిల్లా ఎస్పీగా, 2019లో విశాఖపట్నం డీసీపీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, విజయవాడ డీసీపీగా, 2021లో విజయనగరం 5వ ఏపీఎస్పీ బెటాలియన్, 2023లో పార్వతీపురం మన్యం ఎస్పీగా పనిచేశారు. 2024 ఏపీఎస్పీ మూడవ బెటాలియన్ కాకినాడ కమాండెంట్‌గా, ఆ తర్వాత కాకినాడ ఎస్పీగా పనిచేసి బదిలీపై కర్నూలుకు వచ్చారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- కలెక్టర్ రంజిత్‌బాషా



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

పత్తికొండ రూరల్: విద్యార్థి దశ నుంచే విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. పత్తికొండలోని కస్తూర్బా గాంధీ, అంబేడ్కర్ గురుకుల బాలికల గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కస్తూర్బా పాఠశాలను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో వసతుల గురించి స్పెషల్ ఆఫీసర్ షబానాను అడిగి తెలుసుకున్నారు. పది విద్యార్థులకు సిలబస్ పూర్తయిందా లేదా అన్న వివరాలు తెలుసుకున్నారు. ఏమైనా సందేహాలు తలెత్తితే వాటిని నివృత్తి చేసు కోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాల చేరుకుని మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం సరిగా ఉడకలేదని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈయన వెంట ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఆర్డీఓ భరత్‌నాయక్, తహసీల్దారు రమేష్, ఎంపీడీఓ సువర్ణలత ఉన్నారు.

క్లుప్తంగా

ఆదోని మార్కెట్ యార్డులో గోదాముల స్వాధీనం



గోదామును స్వాధీనం చేసుకుంటున్న యార్డు అధికారులు

ఆదోని అర్బన్: బాడుగ చెల్లించకపోవడంతో ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మూడు గోదాములను పోలీసు, రెవెన్యూశాఖల అధికారుల సమక్షంలో శనివారం యార్డు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఖాదర్‌వలి కంపెనీ గోదాము నంబర్ 329, అహ్మద్ వలి గోదాము నంబర్ 328, ఆదిత్య ట్రేడింగ్ కంపెనీ గోదాము నంబర్ 255 ఉంది. ఈ సందర్భంగా యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. బాడుగ చెల్లించని గోదాములు 59 ఉన్నాయని, రూ.30 లక్షల వరకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మిగిలిన 56 మంది స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లె శివార్లలోని ప్రధాన రహదారిలో శనివారం బనగానపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును మినీ లారీ ఎదురై ఢీ కొంది. బస్సు తాడిపత్రికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ వాహనంలో ఇరుక్కు పోవడంతో స్థానికులు బయటకు లాగారు. బస్సు డ్రైవర్‌తో పాటు ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఫాస్టాగ్‌లో నగదు లేక నిలిచిన ఆర్టీసీ బస్సులు

ఓర్వకల్లు: ఫాస్టాగ్ అకౌంట్‌లో నగదు లేకపోవడంతో శనివారం నన్నూరు టోల్‌ప్లాజా వద్ద రెండు ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. నంద్యాల డిపో కు చెందిన ఏపీ 39 యూహెచ్ 9000, ఏపీ 39 యూజీ 8000 నెంబర్ గల ఆర్టీసీ బస్సులు నంద్యాల నుంచి కర్నూలుకు బయలుదేరాయి. మా ర్గమధ్యలో జాతీయ రహదారిపై ఉన్న నన్నూరు టోల్‌ప్లాజా వద్ద సంబంధిత బస్సులకు ఫాస్టాగ్ లో నగదు లేకపోవడంతో టోల్ సిబ్బంది నిలిపివేశారు. దీంతో ఆర్టీసీ డ్రైవర్లు టోల్ సిబ్బందితో వాదనకు దిగారు. తీరా చేసేదేమిలేక నగదు చెల్లించడంతో బస్సులు ముందుకు కదిలాయి. సుమారు అర గంట సేపు వాగ్వాదం జరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఇంటి వద్ద పింఛన్ ఒట్టిదే!

- ఇంటి దగ్గర పింఛన్ల పంపిణీ నామమాత్రమే
- అవ్వాతాతలకు సచివాలయాల మెట్లు ఎక్కక తప్పని పరిస్థితి
- పలుచోట్ల సర్వర్ పనిచేయక కార్యాలయాల్లోనే పడిగాపులు


తుగ్గలి మండలం అమినాబాద్‌లో పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

కర్నూలు(అగ్రికల్చర్): ఇంటి దగ్గరే పింఛన్ల పంపిణీ పేరుకు మాత్రమే. పింఛన్ సొమ్మును అందించేందుకు సచివాలయ ఉద్యోగులెవ్వరూ ఇంటి వద్దకు రాకపోవడంతో అవ్వాతాతలు, వికలాంగులు ఇతర పింఛన్‌దారులు గ్రామ, వార్డు సచివాలయాల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. సచివాలయాలు, రచ్చబండల దగ్గర పింఛన్ల కోసం పడిగాపులు కాశారు. ఫిబ్రవరి నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారని కూటమి ప్రభుత్వం చెప్పుకుంటున్నా... ఆచరణలో అది కనిపించడం లేదు. ఫిబ్రవరి నెలకు సంబంధించి కూడా పంపిణీ ఇంటి వద్ద జరగకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.ఇటు కర్నూలు, అటు నంద్యాల జిల్లాలో సర్వర్ పని చేయకపోవడంతో మధ్యాహ్నం వరకు అవ్వాతాతలు కాచుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత నుంచి సర్వర్ పని చేయడంతో పంపిణీ కొంత ఊపందుకుంది.

95 శాతం పింఛన్ల పంపిణీ

ఫిబ్రవరి నెలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4,54, 924 పింఛన్‌లకు రూ.194 కోట్లు మంజూరయ్యా యి. ఇందులో కర్నూలు జిల్లాలో 2,39,332 పింఛన్లు ఉండగా 2,27,714 (95.15 శాతం)మందికి పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,15,592 పింఛన్లు ఉండగా 2,03,401 (94.35 శాతం)మందికి పంపిణీ చేశారు. అయితే,ఈ పంపిణీ కార్యక్రమంలో కర్నూలు జిల్లాలో 4,879 మంది, నంద్యాల జిల్లాలో 4,394 మంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో ఇంటి దగ్గరే పింఛన్

వైఎస్సార్‌సీపీ పాలనలో 2024 మార్చి నెల వరకు ప్రతి లబ్ధిదారుడికి ఇంటి దగ్గరే పింఛన్ సొమ్ము అందజేయడం జరిగేది. వలంటరీ వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత పింఛన్లు పొందడంలో అవ్వాతాతలు, వికలాంగులు, వ్యాధి గ్రస్తులు ఎవ్వరు ఇబ్బంది పడలేదు. ఐదేళ్లు ప్రశాంతంగా పింఛన్లు పొందారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పింఛన్‌దారులకు ఇబ్బందులు మొదలయ్యాయి.

అర్హులందరికీ పింఛన్లు

దేవనకొండ: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద అర్హులందరికీ పెన్షన్లు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. శనివారం దేవనకొండ మండలం కరివేముల గ్రామ సచివాలయ పరిధిలో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు, వృద్ధులు, వితంతువులు, వ్యాధిగ్రస్తులకు ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్, డీఆర్డీఏ పీడీ శివనాగలీల పాల్గొన్నారు.

సర్వర్ మొరాయించి.. దాడికి దారితీసి

ఆదోని అర్బన్: కూటమి ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. సర్వర్ సమస్య వేధిస్తోంది. ఈ కారణంతో పలుచోట్ల సచివాలయ ఉద్యోగులు ఇళ్లవద్దకెళ్లి పింఛన్లు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వ్యాధిగ్రస్తులు బయటకువెళ్లి తెచ్చుకోవడం సమస్యగా మారింది. ఈ విషయంలోనే శనివారం ఆదోనిలో పింఛన్‌దారుడి కుమారుడు, సచివాలయ ఉద్యోగి మధ్య మాటామాటా పెరిగి దాడికి దారితీసింది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని 33వ వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ సెక్రటరీ చంద్రశేఖర్ శనివారం పింఛన్ పంపిణీ చేసేందుకు ఖాజీపురవీధిలోకి వెళ్లాడు. సర్వర్ రావడం లేదని వీధిలో పంపిణీ చేస్తున్నాడు. పక్షవాతంతో బాధపడుతున్న ఇబ్రహీంను బయటకు వచ్చి పింఛన్ తీసుకెళ్లాలని చెప్పడంతో అతని కుమారుడు ఖలందర్ తన తండ్రి బయటకు రాలేడని ఇంటి వద్దకు వచ్చి ఇవ్వాలని కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి చేయిచేసుకునే వరకు వెళ్లింది. కాగా పింఛన్‌దారుడు కుమారుడు ఖలందర్ తనపై దాడి చేశాడని సచివాలయ ఉద్యోగి చంద్రశేఖర్ ఫిర్యాదు చేశాడని, ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్‌ఐ రామస్వామి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలంలోని ఎల్.బండ గ్రామ సమీపంలో శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక మద్యాన్ని రవాణా చేస్తున్న కారు పట్టుబడినట్లు కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. ఈ సందర్భంగా కర్ణాటకకు చెందిన కర్ణ గౌడ, అహమ్మద్ హుసేన్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.95 వేలు విలువ చేసే కర్ణాటకకు చెందిన 2400 విస్కీ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు, కారును సీజ్ చేసినట్లు సీఐ వివరించారు.

529 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం నైతిక మానవీయ విలువలు పరీక్షను నిర్వహించారు. జిల్లాలోని 162 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరిగింది. మొత్తం 23, 262 మందికి 22,733 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 529 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి పేర్కొన్నారు. పలు పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. బోర్డు నియమ నిబంధనల మేరకు ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం మండలాల్లో ప్రత్యేక తనిఖీ బృందాల ద్వారా తనిఖీ చేయించామన్నారు. స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు కె.నాగభూషణ రెడ్డి, యు. పద్మావతి, జి.ఎస్.సురేష్ చంద్ర, డి. మల్లికార్జున వివిధ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై హత్యాయత్నం

- వేట కొడవళ్లు, ఇనుప రాడ్లతో టీడీపీ వర్గీయుల దాడి
- వివాహ వేడుకను అడ్డుకుని దౌర్జన్యం


టీడీపీ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన మేకల రాముడు,తిమ్మన్న, బండ రాయిడు

సి.బెళగల్: వివాహ వేడుకను అడ్డుకుని టీడీపీ వర్గీయులు దౌర్జన్యం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను హతం చేసే లక్ష్యంతో వేట కొడవళ్లు, ఇనుప రాడ్లతో దాడులకు పాల్పడ్డారు. మొత్తం ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో వైఎస్సార్‌సీపీ వర్గీయులకు చెందిన యువకుడి వివాహ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. రాత్రి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వారు పెళ్లి వేడుక ఊరేగింపు (మెరివెన)ను నిర్వహిస్తున్నారు. గ్రామంలోని తమ ఇళ్ల దగ్గర ఊరేగించేందుకు వీలు లేదని టీడీపీ వర్గీయులు ప్రధాన రోడ్డుపై అడ్డుగా రెండు చోట్ల రాళ్లను పెట్టారు. వైఎస్సార్‌సీపీ వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి, పోలీసుల సూచనలతో రోడ్డును అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించారు. ఊరేగింపు వెనక నుంచి టీడీపీకి చెందిన పాండు కుమారుడు వెంకటేష్ ఆటోలో వస్తూ వాదనకు దిగాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. అయితే అప్పటికే అక్కడి చేరుకున్న పోలీసులు ఇరువర్గాలను వారికి సర్ది చెప్పి పెళ్లి ఊరేగింపు బంద్ చేయించారు. ఘర్షణకు కారణమైన పాండు కుమారుడు వెంకటేష్ శనివారం ఉదయం రెచ్చగొట్టాడు. టీడీపీ వారు మూకుమ్మడిగా వేటకొడవళ్లు, ఇనుపరాడ్లు, ఖాళీ మద్యం సీసాలు, పట్టుడు కట్టెలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మేకల రాముడు, తిమ్మన్న, బండ రాయుడు, బాలరాజులను హతం చేసేందుకు టీడీపీ వర్గీయులు యత్నం చేశారు. తల, కాలుపై వేటకొడవళ్లతో తీవ్రంగా నరికారు. ఐదుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఘర్షణలో టీడీపీకి చెందిన పాండు కుమారుడు వెంకటేష్, నరసింహుడు కుమారుడు వెంకటేష్‌కు స్వల్ప గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.


బ్రాహ్మణదొడ్డిలో విచారణ చేస్తున్న పోలీసులు

గ్రామాన్ని సందర్శించిన డీఎస్పీ

ఇరువర్గాల ఘర్షణ విషయం తెలుసుకున్న కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ బ్రాహ్మణదొడ్డి గ్రామం చేరుకున్నారు. ఘర్షణ వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడంతో పాటు శాంతి భద్రత పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. డీఎస్పీ వెంట కోడుమూరు సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య తదితరులు ఉన్నారు.

జిల్లాను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- శాప్ చైర్మన్ రవి నాయుడు


స్టేడియంలో వసతుల గురించి ఆరా తీస్తున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

కర్నూలు (టౌన్): వెనుకబడిన కర్నూలు జిల్లాను క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శనివారం ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి శాప్ చైర్మన్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాన్ని పరిశీలించారు. అస్తవ్యస్తంగా ఉన్న స్టేడియం నిర్వహణ పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇండోర్ స్టేడియంలో టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. పారిశుధ్య నిర్వహణలో డీఎస్ డీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చు కోవాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలులో అత్యుత్తమ క్రీడా వసతులు ఏర్పాటు చేసి కర్నూలు స్టేడియాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఫుట్‌బాల్ పశ్చిమ మైదానం, అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్, వాకర్స్ ట్రాక్ ఏర్పాటు చేయాలని క్రీడా సంఘాల ప్రతినిధులు రామాంజనేయులు, హర్షవర్ధన్, వెంకటేష్, నాగరత్నమయ్య, చిన్న సుంకన్న, సురేంద్ర, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్యలు విన్నవించారు. అనంతరం శాప్ చైర్మన్‌ను పలు క్రీడా సంఘాలు సత్కరించాయి.

యూట్యూబర్ అరెస్టు

కర్నూలు: కామన్ మ్యాన్ యూట్యూబ్ ఛానెల్ అధినేత పాల్లూరి రమణను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈయన అయ్యప్పస్వామి గుడి సమీపంలోని బీకే సింగ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటాడు. జిల్లా మంత్రి టీజీ భరత్, ఆయన తండ్రి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్‌పై వార్తలు (అనుచిత వ్యాఖ్యలు) పోస్టు చేశాడనే కారణంపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మాజీ కార్పొరేటర్ విఠల్ శెట్టి, ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆకెపోగు శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. శనివారం తెల్లవారుజామున పోలీసులు యూట్యూబర్ రమణ ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించి రిమాండ్‌కు పంపినట్లు సమాచారం.

ప్రముఖ రంగస్థల నటుడు బీసీ కృష్ణ మృతి

- బిల్వ మంగళ పాత్రలో వేలాది ప్రదర్శనలు


బీసీ కృష్ణ(ఫైల్)

కర్నూలు కల్చరల్: ప్రముఖ రంగస్థల నటుడు బీసీ కృష్ణ (78) మృతి చెందారు. చాలా రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కిడ్నీలు ఫెయిల్ కావడంతో శనివారం సాయంత్రం మరణించారు. చింతామణి నాట కంలో బిల్వమంగళుడుగా వేల నాటకాలు ప్రదర్శించి రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. బిల్వమంగళుడు పాత్ర అంటే బీసీ కృష్ణ తప్పా మరొకరు అంత అద్భుతంగా ప్రదర్శించలేరనే విధంగా నటించి ప్రేక్షకులను అలరించారు. ప్రముఖ హార్మోనిస్టు కేసీ శివారెడ్డి ముఖ్య శిష్యునిగా ఉంటూ 30 సంవత్సరాలు రంగ స్థల నాటకాల్లో కీర్తి ప్రతిష్ఠలు పొందారు. అప్పటి ముఖ్య మంత్రి ఎన్టీఆర్ చేత సత్కారం పొందారు. తెలుగు యూనివర్సిటీ నుంచి సత్కారం అందుకున్నారు. కందుకూరి పురస్కారం పొందారు. ఆయన మృతి రంగస్థలానికి తీరని లోటని పలువులు కళాకారులు, కళా సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. కేసీ శివారెడ్డి రూపొందించిన ఒక ఆణి ముత్యం బీసీ కృష్ణ అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక నాయకులు బైలుప్పల షఫి, హనుమాన్ కళా సంస్థ అధ్యక్షులు హనుమంత రావు చౌదరి, కవి, రచయిత పార్వతయ్య, తదితరులు బీసీ కృష్ణ పార్థివ దేహానికి నివాళులర్పించారు.

యువకుడిపై హత్యాయత్నం

బొమ్మలసత్రం: పాతగొడవల కారణంగా హరి అనే యువకుడిని మరో యువకుడు కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసుల సమాచారం మేరకు.. రోజకుంట వీధికి చెందిన హరి పట్టణంలో రోజువారి పనికి వెళ్తాడు. ఇతనికి నందమూరినగర్ వీధికి చెందిన గౌస్‌తో వ్యక్తిగత గొడవలు ఉన్నాయి. ఈక్రమంలో శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గౌస్ కత్తితో హరిపై దాడి చేశాడు. స్థానికులు అడ్డు కోవటంతో అతను అక్కడి నుంచి పరారయ్యాడు. తర్వాత స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈమేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వివాహిత ఆత్మహత్య

పగిడ్యాల: తూర్పు ప్రాతకోట గ్రామంలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గొల్ల స్వాములు భార్య లక్ష్మీదేవి(36) కొంత కాలంగా థైరాయిడ్, మానసిక రోగంతో బాధపడుతోంది. పలు డాక్టర్లను చూపించినా జబ్బు నయం కాకపోవడంతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురైంది. శనివారం ఉదయం భర్త పొలానికి వెళ్లగా ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుంది. పొలం నుంచి తిరిగి వచ్చిన స్వాములు..ఫ్యాన్‌కు వేలాడుతున్న భార్యను కిందికి దించి చూడగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే మృతురాలి అక్క అలివేలు తన చెల్లెలిని కొట్టి చంపారని అనుమానం వ్యక్తం చేశారు. కాగా ముచ్చుమర్రి ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొత్తూరు హుండీ ఆదాయం లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. నగదు రూ. 20,77,133, వెండి 945 గ్రాములున్నట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. ఇవి గతేడాది డిసెంబర్ 29 నుంచి నేటి వరకు భక్తులు హుండీలో సమర్పించిన కానుకలన్నారు.



శిఖరం.. 'శిశిర' సోయగం

ప్రస్తుతం శిశిర రుతువు నడుస్తోంది. మాఘ మాసంలో పలు వేడుకలు సాగుతున్నాయి. శనివారం రాత్రి వేళ కర్నూలు నగరంలోని వినాయక్ ఘాట్ వద్ద సుందర దృశ్యం కనిపించింది. కేసీ కెనాల్ పక్కన ఉన్న గణేశుని ఆలయం శిఖరంపై నక్షత్రం దేదీప్యమానంగా వెలిగింది. శిఖరం పక్కనే చంద్రుని సౌరభం ఆకట్టుకుంది. క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణ కాలంలో ఈ సుందరం ప్రజల్లో సరి కొత్త ఆధ్యాత్మిక భావాన్ని నింపింది.

– డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

కెనరా బ్యాంక్ Canara Bank
కర్నూలు బ్రాంచ్ (0661) భగీరథి కాంప్లెక్స్, పార్కు రోడ్డు, కర్నూలు ఎపి-518001. ఫోన్: 9440905406

సెక్షన్ 13(4) స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం కెనరా బ్యాంక్ యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి ఋణగ్రహీత: శ్రీ. వై. శివ నాగేశ్వర రావు, తండ్రి: వై. నాగన్న వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయి సొమ్ము రూ.30,82,620/- (అక్షరాల ముప్పై లక్షల ఎనభై రెండు వేల ఆరు వందల ఇరవై రూపాయలు మాత్రమే) మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా తేది 21-11-2024న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని 01.02.2025వ తేదీన స్వాధీనపరచుకున్నారని ఋణగ్రహీతలు, హామీదారులు మరియు యావన్మంది ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీతలు, హామీదారులు మరియు ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి కెనరా బ్యాంక్ వారికి చెల్లించవలసిన బకాయి రూ. 30,83,165/- (అక్షరాల ముప్పై లక్షల ఎనభై మూడు వేల నూట అరవై ఐదు రూపాయలు మాత్రమే) + వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13, సబ్-సెక్షన్ (8) చట్ట ప్రకారము ఋణగ్రహీతలు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:
కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కర్నూలు రెవెన్యూ డివిజన్, కర్నూలు సబ్-డివిజన్, కల్లూరు, చంద్రశేఖర్ నగర్, వార్డునెం.87, సర్వేనెం.669, ప్లాట్ నెం.247 నందు మొత్తం 1750 చ॥అ॥ లేదా 194.44 చ॥గ॥ విస్తీర్ణంలో నిర్మించిన రెసిడెన్షియల్ ఇల్లు నెం. 87/1362-1-4-ఎ. హద్దులు: తూర్పు: 30 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 232, ఉత్తరం: ప్లాట్ నెం. 246, దక్షిణం: ప్లాట్ నెం.248, కొలతలు: తూర్పు-పడమర: 50 అ॥లు, ఉత్తరం - దక్షిణం: 35 అ॥లు. టైటిల్ హోల్డర్: వై.శివ నాగేశ్వర రావు, తండ్రి: వై. నాగన్న.

తేది: 01.02.2025, ప్రదేశం: కర్నూలు సం/- అధీకృత అధికారి,కెనరా బ్యాంక్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ సమిష్టి కృషితో రియల్ ఎస్టేట్ వ్యాపారం కేవలం 30 మందికి మాత్రమే. స్థలం రేటుకే అపార్ట్‌మెంట్. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు దగ్గర, హైవే ఆనుకొని. సెల్: 94907 63299 [L-794732]

■ పొలాలు, ప్లాట్లు అమ్ముటకు, కొనుటకు సంప్రదించండి: సెల్: 96184 45969 పెద్ద బోధనం, నందికొట్కూరు, హెచ్.కైరవాడి, ఉలిందకొండ దగ్గర పొలాలు ఉన్నాయి. [L-794730]

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న కర్నూలు సిటీలో ప్లాట్లు, భూములు, ఇండ్లు కొనాలన్నా, అమ్మాలన్నా సంప్రదించండి: జె.వై.శాస్త్రి, సెల్: 96762 11033. [L-794751]

PLOT FOR SALE

■ కర్నూలు బళ్లారి రోడ్డు, ఓల్డ్ రిలియన్స్ మార్ట్ వెనుక రిచ్‌మన్డ్ విల్లాస్, ఫేస్-2లో 53x60 ఫీట్, వెస్ట్ (2ప్లాట్లు) 88 & 89 ప్లాట్లు అమ్మబడును. కొనుగోలుదారులు మాత్రమే. సంప్ర:9885937269 [L-794769]

■ కర్నూలు-పంచలింగాల స్కంద గార్డేనియ వెంచర్ డి. బ్లాక్ నందు 30X50 సైజు గల 3.5 సెంట్ల పడమర ఫేస్ ప్లాట్ నెం.12 అమ్మకానికి కలదు. సెల్: 90529 59380. [L-794714]

■ కర్నూలు - నంద్యాల రోడ్, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ఏరియాలో రోజు రోజుకు కొత్త రూపం దాల్చుతున్న ఓర్వకల్లు ఏరియాలో 3 సెంట్ల ప్లాటు 4 లక్షలు మాత్రమే. రిజిస్ట్రేషన్ ఉచితం. సంప్ర: 81067 75586 [L-794728]

■ కర్నూలు ఓర్వకల్లు తిప్పాయిపల్లెలో సోలార్ మెయిన్ రోడ్డుకి న్యూవెంచర్ నందు 30x45 సైజు ప్లాట్లు తక్కువ బడ్జెట్‌లో కలవు. బళ్లారి-కోడుమూరు రోడ్డులో మెయిన్ రోడ్డుకు న్యూవెంచర్‌లో 30x40 సైజు ప్లాట్లు సులభ వాయిదా పద్ధతిలో కలవు. సంప్ర: 93338 20555. [L-794758]

TO - LET

■ కర్నూలు అశోక్‌నగర్ మెయిన్ రోడ్డులో 1వ ఫ్లోర్‌లో 2BHK ఇండిపెండెంట్ హౌస్ విత్ బాల్కని, 2 బాత్ రూమ్స్ ఇల్లు అద్దెకు కలదు. 88979 61204, 80085 65945 [L-794774]

■ కర్నూలు సోమిశెట్టి నగర్, రెవెన్యూ కాలనీ, NRI VILLAS, కొత్త విల్లా నెం:8, 4BHK అన్ని వసతులతో విత్ లిఫ్ట్ సౌకర్యం గల ఇల్లు అద్దెకు ఇవ్వబడును. ✆ 9849438138, 9440165902. [L-794770]

HOUSE FOR SALE

■ తూర్పు-ఉత్తరం కార్నర్, నూతనంగా నిర్మించిన Duplex House (G+2) Fullly furnished (3000 sft) నంద్యాల చెక్‌పోస్ట్ దగ్గర, వినాయక గుడి వెనుక భాగములో అమ్మకమునకు కలదు. Bedrooms: 5 No.s, Halls: 3No.s, Corridors: 3No.s, Car Parking, Bore కలవు. సంప్రదించండి: 9440282771, 9703741054. [L-794721]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165

LAND FOR SALE

■ నంద్యాల పట్టణం సమీపంలో మసీదుపురం గ్రామ పంచాయతీలో, తిరుపతి హైవే పక్కన, సీడ్స్ ఫ్యాక్టరీ ఎదురుగా, ఏ.సి గోడౌన్ పక్కన, 1.76 ఎకరాల భూమి అమ్మకానికి ఉంది. ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఉన్నది 21 ఫీట్ల రోడ్ ఆ భూమికి గోడౌన్ పక్క నుండి ఉంది. కొనదల్చుకున్నవారు ఈ మొబైల్ నెంబర్‌కి సంప్రదించండి. ఫోన్: 7675989902 [HA-167]

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 96430 10487, 8376089771, 011-25920179 [DA-6200]

FOR SALE

■ నంద్యాల పట్టణం, సంజీవ నగర్ గేట్ దగ్గర అన్ని వసతులతో కూడినటువంటి A/c లేడీస్ హాస్టల్ అమ్మకానికి కలదు. వివరాలకు సంప్ర: 9160343569. [L-783239]

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98666. [L-794772]

GYNECOLOGY

■ డా॥ కె.అరవింద MBBS, DNB, OBG గర్భిణీ మరియు స్త్రీ వ్యాధి నిపుణురాలు. 2PM To 5PM & 5 PM-9PM. శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు.✆ 88970 87874 [L-794753]

PHYSICIAN

■ డా॥కె.చంద్రమౌళి రెడ్డి, Gen. MED, IDCCM, జనరల్ ఫిజిషియన్, ఫెలో ఇన్ క్రిటికల్ కేర్ యూనిట్, అడ్రస్: శ్రీ సాయిచంద్ర క్లినిక్, గాయత్రి ఎస్టేట్, కర్నూలు. సెల్: 88970 87874. [L-794752]

WANTED

■ ఎపి, తెలంగాణ, కర్ణాటకలో జిల్లాల వారీగా త్వరలో ప్రారంభం కానున్న SPICES EXPORT బిజినెస్‌కు వ్యాపార భాగస్వాములు కావలెను. ఎక్కువ లాభం ఇవ్వబడును. ✆ 8309023036 [L-794771]

■ Wanted CA (Auditor) Sr. Accountant or MBA Finance in Dr. Kailash's Clear Skin, Vidyanagar, Kurnool. Contact: 86888 75435, 93938 27032 [L-SCA25001183]

■ సెక్యూరిటీ సూపర్‌వైజర్, జెంట్స్ టైలర్ కావలెను. ఇంటర్వ్యూ: 03.02.2025 ఉ॥ 11.00 గంటలకు, డ్రస్ సర్కిల్ షాపింగ్ మాల్, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, కర్నూలు [L-171]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, దోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244 [B-1172677]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్. ✆ 91332 71122, 95534 61177 [B-1266958]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్, భో+ వసతి +జీతం: 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843 [B-1266955]

■ అన్‌లోడర్స్ పురుషులు కావలెను. 8గం॥ డ్యూటీ Age: 25-45 years ఆధార్‌కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ కావలెను. మంచిజీతం + ESI+ EPF కలవు. ✆ 9100028528, 7396128206 [G-1930]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640258899, 9640468899 [HA-1397]

■ కృష్ణలీలా కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు,ఆయా,నర్సులు,వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ:15 వేలు - 40వేలు,ఫ్రీరూం+భోజనం.HYD. 7993583999. [HA-99693]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పార్ట్‌టైం పనిచేస్తూ లక్షలు సంపాదించే అవకాశం ఉద్యోగస్తులకు మంచి అవకాశం. సంప్ర॥ 7702805174 [SCA25001487]

■ URGENTLY REQUIRED. Designation: Marketing Executive 1 Post, HQ : Kurnool, Company: Celera Neuro and Psychiatric Division Below 30 Years and 6 Months Experience, ✆ 99858 81028. [T-2487]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపై చదివిన20-50 సం॥ స్త్రీ/పు టెలికాలర్స్, సూ॥వైజర్లు, అడ్మిన్లు, అకౌంటెంట్లు,కా॥.భో+వ+జీ20-30వేలు . ఫోన్: 9491651122, 9491821122 [SCA25001389]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సచిన్‌కు బీసీసీఐ 'జీవిత సాఫల్య' పురస్కారం

మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 'జీవిత సాఫల్య' పురస్కారం అందజేసింది. ముంబైలో శనివారం జరిగిన బీసీసీఐ వార్షిక అవార్డుల కార్యక్రమంలో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) అధ్యక్షుడు జై షా చేతుల మీదుగా సచిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నాడు. క్రికెట్లో దేశానికి అందించిన విశేష సేవలకు గుర్తింపుగా భారత తొలి కెప్టెన్ కల్నల్ సీకే నాయుడు పేరు మీదుగా 1994 నుంచి ఈ 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డును ప్రదానం చేస్తున్నారు.

పసిడి పతకం నెగ్గిన పల్లవి

దెహ్రాడూన్: జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్వర్ణ పతకం లభించింది. శనివారం జరిగిన మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 71 కేజీల విభాగంలో సనాపతి పల్లవి పసిడి పతకం సొంతం చేసుకుంది. పల్లవి మొత్తం 212 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. పల్లవి స్నాచ్‌లో 94 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 118 కేజీలు బరువెత్తింది. శుక్రవారం పురుషుల 67 కేజీల విభాగంలో నీలంరాజు ఆంధ్రప్రదేశ్‌కు తొలి బంగారు పతకాన్ని అందించాడు.





కేలా రెనెకి
నికీ ప్రసాద్

ఒకటే లక్ష్యం... రెండో ప్రపంచకప్

కౌలాలంపూర్: రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా గడ్డపై జరిగిన మొట్టమొదటి అండర్–19 టి20 ప్రపంచ కప్‌లో భారత అమ్మాయిల జట్టు జగజ్జేతగా అవతరించింది. రెండేళ్ల తర్వాత అదే ప్రపంచకప్‌ను నిలబెట్టుకునేందుకు ఈసారి దక్షిణాఫ్రికా జట్టుతో టీమిండియా ఫైనల్ సంగ్రామానికి సిద్ధమైంది. అజేయంగా తుది పోరుకు అర్హత సాధించిన నికీ ప్రసాద్ నాయకత్వంలోని భారత అమ్మాయిల జట్టు విజయవంతంగా 'రెండో ప్రపంచకప్ మిషన్' పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉంది. భారత్ మాదిరిగానే ఓటమి లేకుండా ఫైనల్ చేరిన దక్షిణాఫ్రికా జట్టు వరల్డ్‌కప్ ముచ్చట తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. ఈ నేపథ్యంలో జోరు మీదున్న రెండు అజేయ జట్ల మధ్య నేడు జరిగే అండర్–19 ప్రపంచకప్ టైటిల్ పోరుపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారీ భారత్ జైత్రయాత్ర కొనసాగుతుందా! లేదంటే కొత్త చాంపియన్ ఆవిర్భవిస్తుందా! మరి కొన్ని గంటల్లో తేలిపోతుంది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ వనరులతో పూర్తిస్థాయి ఆల్‌రౌండ్ సామర్థ్యంతో ఉన్న టీనేజ్ టీమిండియాను ఎదుర్కోవడమే ఎవరికైనా అతిపెద్ద సవాల్. ఇక అలాంటి అభేద్యమైన జట్టును ఓడించాలంటే మాత్రం దక్షిణాఫ్రికా మైదానంలో పెద్ద 'ప్రపంచ' యుద్ధమే చేయాలనడంలో అతిశయోక్తి లేదు!

నేడు మహిళల అండర్–19 టి20 ప్రపంచకప్ టైటిల్ పోరు
- దక్షిణాఫ్రికాతో భారత్ 'ఢీ'
- ఓటమి లేకుండానే రెండు జట్లు ఫైనల్లోకి
- త్రిష, కమలినిలపై దృష్టి
- మధ్యాహ్నం 12 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఆ ఇద్దరిని కట్టడి చేస్తే...

తెలంగాణ స్టార్ బ్యాటర్ గొంగడి త్రిష! మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో తనను విస్మరించిన ఫ్రాంచైజీల కళ్లకు కట్టుకున్న గంతల్ని తన అసాధారణ బ్యాటింగ్‌తో విప్పేసింది. ఇప్పుడు 'ఫైనల్ మిషన్' ముంగిట అందరి దృష్టి ఆమెపైనే ఉంది. ఈ టోర్నీలో ఓపెనర్ త్రిష ఫామ్, క్రీజులో ఆమె కనబరుస్తున్న పోరాటపటిమ ప్రత్యర్థి బౌలర్లకు కఠిన సవాళ్లు విసురుతున్నాయి. మరో ఓపెనర్ కమలిని, సనిక చాల్కెలతో కూడిన భారత బ్యాటింగ్ విభాగం పటిష్టంగా ఉంది. దక్షిణాఫ్రికా విజయంపై ఆశలు పెంచుకోవాలంటే మాత్రం ముఖ్యంగా త్రిష, కమలినిలను తక్కువ స్కోరుకు పరిమితం చేయాల్సి ఉంటుంది. ఈ టోర్నీలో త్రిష 265 పరుగులతో టాప్ స్కోరర్‌గా ఉండగా... కమలిని 135 పరుగులతో మూడో స్థానంలో ఉంది. ఆ తర్వాత భారత్ నుంచి అత్యధిక పరుగులు సనిక చాల్కె (6 మ్యాచ్‌ల్లో 69) చేసింది. భారత బౌలింగ్ విభాగాని కొస్తే ఆయుశి శుక్లా, పారుణిక సిసోడియా, వైష్ణవి శర్మలతో కూడిన స్పిన్ త్రయం విశేషంగా రాణిస్తోంది. సహజంగానే సఫారీలకు స్పిన్ అంటేనే కష్టం. అలాంటి జట్టుపై ఫామ్‌లో ఉన్న ఈ ముగ్గురు స్పిన్నర్లు తప్పకుండా ప్రభావం చూపిస్తారు. అలాగని ఫైనల్‌కు చేరిన సఫారీ జట్టును తక్కువ అంచనా వేయలేం. కేలా రెనెకి కెప్టెన్సీలో దక్షిణాఫ్రికా జట్టు సెమీఫైనల్లో గట్టి ప్రత్యర్థి ఆస్ట్రేలియాను బౌలింగ్‌తో కట్టడి చేసి... బ్యాటింగ్‌తో చుట్టేసింది. జెమ్మా బోతా, లౌరెన్స్, కరబొ మెసోలతో కూడిన బ్యాటింగ్ లైనప్, ఆష్లే వాన్‌విక్, ఎన్‌తబిసెంగ్ నిని, శేషిని నాయుడులతో కూడిన బౌలింగ్ దళం కూడా మెరుగ్గా ఉంది.

పిచ్, వాతావరణం

భారత్‌కు బాగా అలవాటైన పిచ్. అటు బౌలింగ్‌కు, ఇటు బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశం ఉంది. సాధారణ వాతావరణమే. వాన ముప్పు దాదాపుగా లేదు.

ఆధిక్యం కోసం ఆఖరి పోరు



ముంబై: ఇప్పటికే సిరీస్ భారత్ చేతికందింది. ఇక మిగిలిందల్లా ఆధిక్యం పెంచుకోవడమే! మూడు వన్డేల సిరీస్‌కు ముందు ఈ చివరి మ్యాచ్ గెలిచి... 4–1తో ఆధిక్యం, ఆత్మవిశ్వాసంతో వెళ్లాలని టీమిండియా భావిస్తోంది. ఇక ఇంగ్లండ్ పరిస్థితి దీనికి భిన్నం. చేజారిన సిరీస్‌తో ఒత్తిడిలో ఉన్న బట్లర్ బృందం ఇప్పుడు భారత్ ఆధిపత్యానికి గండి కొట్టాలని... ఈ పొట్టి సిరీస్‌లో ఆతిథ్య జట్టు శుభారంభమివ్వగా... విజయంతో ముగింపు తమది కావాలని ఇంగ్లండ్ జట్టు గట్టిగా ఆశిస్తోంది. ఈ నేపథ్యంలో ఆఖరి పోరులో పైచేయి సాధించేందుకు పర్యాటక జట్టు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమైంది. మొత్తంమీద ఇరుజట్ల మధ్య మరో రసవత్తర పోరుకు నేడు వాంఖెడే స్టేడియం వేదిక కానుంది.

నేడు ఇంగ్లండ్‌తో భారత్ ఐదో టి20 మ్యాచ్
- సంజూ సామ్సన్, సూర్యకుమార్‌లకు మరో అవకాశం
- ఒత్తిడిలో బట్లర్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సంజూ... మెరిపించు!

ఈ సిరీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఆడాడు. తిలక్ వర్మ గెలిపించే 'షో' చేశాడు. హార్దిక్ పాండ్యా అసలైన ఆటను గత మ్యాచ్‌లో బయటికి తెచ్చాడు. అక్షర్ పటేల్ బంతితో లేదంటే బ్యాటింగ్‌తో జట్టుకు అక్కరకొస్తున్నాడు. అంతెందుకు అరకొరగా... అంటే శివమ్ దూబే 'కన్‌కషన్'తో తుది జట్టులోకి వచ్చిన హర్షిత్ రాణా కూడా మ్యాచ్ గెలిపించే బౌలింగ్ ప్రదర్శన కనబరిచాడు. కానీ టాప్–4లో ఓపెనర్ సంజూ సామ్సన్, కెప్టెన్ సూర్యకుమార్‌ల తోనే జట్టు మేనేజ్‌మెంట్ కలవరపడుతోంది. తర్వాతి ప్రపంచకప్ వేటకు కోచ్ గంభీర్ కోర్ గ్రూపులోని ఆటగాళ్లు ఇలా వరుసగా విఫలమవడం జట్టుకు ప్రతికూలంగా మారింది. బౌలింగ్‌లో అర్ష్‌దీప్, పాండ్యాలు వెన్నుదన్నుగా నిలుస్తుంటే స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఉన్నపళంగా మ్యాచ్‌ను మలుపుతిప్పే మాయాజాలంతో ఆకట్టుకుంటున్నాడు. రవి బిష్ణోయ్ కూడా ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడుతున్నాడు.

2–3 లక్ష్యంతో ఇంగ్లండ్

సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్‌కు ఇప్పుడు ఆఖరి పంచ్ మాత్రమే మిగిలుంది. ఇందులో తమ పవర్ చాటుకొని తదుపరి వన్డే సిరీస్‌ను తాజాగా ప్రారంభించాలని బట్లర్ జట్టు అనుకుంటుంది. సాల్ట్ గత మ్యాచ్‌లో టచ్‌లోకి వచ్చినా కొద్దిసేపే క్రీజులో ఉన్నాడు. ఇప్పుడు లయను అందుకుంటే బెన్ డకెట్‌తో ఓపెనింగ్ వికెట్‌కు భారీ ఆరంభం ఇవ్వగలడు. ఇదే జరిగితే... తదుపరి పరుగుల ప్రవాహాన్ని బట్లర్, హ్యారీ బ్రూక్, లివింగ్‌స్టోన్, జాకబ్ బెథెల్, బ్రైడన్ కార్స్‌లు తీసుకెళ్తారు. ఆర్చర్, సకిబ్ మహమూద్ పేస్‌తో ఆకట్టుకుంటుండగా, స్పిన్‌తో ఆదిల్ రషీద్ నిలకడను ప్రదర్శిస్తున్నాడు.

5 వాంఖెడే మైదానంలో ఇప్పటి వరకు భారత జట్టు ఐదు టి20 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో మూడింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. చివరి మూడు మ్యాచ్‌ల్లో భారత జట్టే నెగ్గింది.

సిరీస్ చేజారినా... సమరంలో పట్టు కోల్పోరాదని ఐదో టి20లో నిరూపించుకోవాలని ఇంగ్లండ్ బృందం చూస్తోంది.

పిచ్, వాతావరణం

వాంఖెడే బ్యాటింగ్‌కు అచ్చొచ్చే పిచ్. చాలా మ్యాచ్‌ల్లో, ప్రత్యేకించి టి20ల్లో చేజింగ్ జట్లకు విజయ అవకాశాలిచ్చింది. అలాగని బౌలింగ్ తేలిపోదు. స్పిన్నర్లు ప్రభావం చూపొచ్చు. వాన ముప్పు లేదు.

బడ్జెట్‌లో క్రీడలకు రూ.3,794 కోట్లు

గతం కంటే 351.98 కోట్లు పెంపు

న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో క్రీడలు, యువజన సర్వీసుల శాఖకు రూ. 3,794.30 కోట్లు కేటాయించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆ మేరకు నిధుల్ని కేటాయించారు. గత బడ్జెట్‌లో రూ. 3442.32 కోట్లు ఇవ్వగా... తాజాగా రూ.351.98 కోట్లు పెంచింది. కేంద్ర క్రీడాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా' కార్యక్రమానికే ఈ క్రీడా బడ్జెట్లో ప్రాధాన్యం దక్కింది. గతంలో రూ. 800 కోట్లు కేటాయించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచింది. నికరంగా రూ. 200 కోట్లను హెచ్చింపు చేసింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు ఇచ్చే గ్రాంట్లను కూడా పెంచింది. గతంలో సమాఖ్యలకు రూ. 340 కోట్లు ఇవ్వగా తాజా ఆర్థిక సంవత్సరంలో రూ. 400 కోట్లు కేటాయించారు. భారత స్పోర్ట్స్ అథారిటీకి రూ. 830 కోట్లు (గత బడ్జెట్ కంటే రూ. 15 కోట్లు అదనం) ఇవ్వనున్నారు. అథ్లెట్ల పారదర్శకత పోటీ కోసం పాటుపడుతున్న జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) లాబోరేటరీకి రూ. 23 కోట్లు (గతంలో రూ. 18.70 కోట్లు) కేటాయించింది. 1998లో ఏర్పాటు చేసిన జాతీయ స్పోర్ట్స్ అభివృద్ధి నిధి కోసం రూ. 18 కోట్లను యథాతథంగా కొనసాగించినప్పటికీ... క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాలకు స్వల్పంగా కోత పెట్టింది. పోయిన ఏడాది రూ. 42.65 కోట్లు ఇస్తే ఈసారి రూ. 37 కోట్లకు పరిమితం చేసింది. యువజన సర్వీసులకు భారీగా కోత పెట్టింది. గత బడ్జెట్లో రూ. 55 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం రూ. 11.70 కోట్లే విదిలించింది. జమ్మూకశ్మీర్‌లో క్రీడా సదుపాయాల కల్పన కోసం రూ. 20 కోట్లు ఇవ్వనుంది. గతం కంటే రూ. 14 కోట్లు ఎక్కువగా కశ్మీర్‌లో మౌలిక సౌకర్యాలకు వెచ్చించనుంది.

టోగోపై 2–0 ఆధిక్యంలో భారత్

న్యూఢిల్లీ: డేవిస్‌కప్ ప్రపంచ టీమ్ టెన్నిస్ వరల్డ్ గ్రూప్–1 ప్లే ఆఫ్ మ్యాచ్‌లో భారత్ శుభారంభం చేసింది. టోగో జట్టుతో శనివారం మొదలైన ఈ పోటీలో తొలి రోజు జరిగిన రెండు సింగిల్స్‌లోనూ భారత ఆటగాళ్లు ఆడుతూ పాడుతూ విజయం సాధించారు. ఫలితంగా భారత్ 2–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి సింగిల్స్‌లో శశికుమార్ ముకుంద్ 6–2, 6–1తో లియోవా (టోగో)పై నెగ్గగా... రెండో సింగిల్స్‌లో రామ్‌కుమార్ 6–0, 6–2తో సెటోడ్జి (టోగో)ను ఓడించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


సాక్షి సినిమా


● 'దిల్' రాజు, అనిల్ రావిపూడి, శిరీష్

ఈ సక్సెస్ చాలా పాఠాలు నేర్పింది

–'దిల్' రాజు

''ఇండస్ట్రీలో బడ్జెట్ కాదు.. కథే ముఖ్యం. మేము కూడా కథలని నమ్ముకుని సినిమాలు నిర్మించాం. కొత్త దర్శకులతో తీసినప్పుడు ఎన్ని విజయాలు వచ్చాయో అందరికీ తెలిసిందే. అయితే కాంబినేషన్స్ అంటూ నాలుగైదేళ్లుగా మేం తడబడుతున్నాం. 'సంక్రాంతికి వస్తున్నాం' హిట్‌తో అనిల్ మళ్లీ మాకు ఒక రహదారి వేసి ఇచ్చాడు. ఈ సక్సెస్ నాకు కూడా చాలా పాఠాలు నేర్పించింది'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన డిస్ట్రిబ్యూటర్స్ గ్రాటిట్యూడ్ మీట్‌లో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''సాధారణంగా డిస్ట్రిబ్యూటర్స్‌కి బ్రేక్ ఈవెన్ అయితేనే సూపర్ హిట్. అయితే వాళ్లు నష్టపోయినప్పుడు కూడా సినిమా సూపర్ హిట్ పోస్టర్స్ పడుతుంటాయి. 90 శాతం ఫెయిల్యూర్స్, కేవలం 10 శాతం మాత్రమే సక్సెస్ ఉండే ఇండస్ట్రీ ఇది. 20 ఏళ్లుగా మాతో ప్రయాణం చేస్తున్న డిస్ట్రిబ్యూటర్స్‌కి ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''సంక్రాంతికి వస్తున్నాం' ఆరు రోజుల్లోనే రూ.100 కోట్లు షేర్ రాబట్టింది. ఓ రీజినల్ ఫిలింకి చూడలేనేమో అనుకున్న రూ. 300 కోట్ల గ్రాస్ నంబర్ మా మూవీతో చూడబోతున్నందుకు హ్యాపీ'' అని తెలిపారు. ''20 ఏళ్ల క్రితం డిస్ట్రిబ్యూటర్‌కి ఉన్న విలువ ఇప్పుడు లేదు. ఇలాంటి సమయంలో వాళ్లు తలెత్తుకునేలా చేసిన సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'' అని శిరీష్ పేర్కొన్నారు. డిస్ట్రిబ్యూటర్స్ సాయికృష్ణ, రాజేశ్, హరి, శోభన్, ఎల్వీఆర్ మాట్లాడారు.


● 'తంగలాన్'లో విక్రమ్


● 'గామి'లో విశ్వక్ సేన్

అరుదైన గౌరవం

విశ్వక్ సేన్ హీరోగా నటించిన 'గామి', విక్రమ్ కథానాయకుడిగా చేసిన 'తంగలాన్' సినిమాలకు అరుదైన గౌరవం దక్కింది. 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025'లో ప్రదర్శనకి ఈ చిత్రాలు ఎంపికయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా ఈ నెల 9 వరకూ జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారత సినిమాలకు చోటు దక్కడం విశేషం. విశ్వక్ సేన్ హీరోగా, చాందినీ చౌదరి హీరోయిన్‌గా రూపొందిన తెలుగు చిత్రం 'గామి'. ఈ చిత్రంతో విద్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయమయ్యారు. కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం 2024 మార్చి 8న విడుదలైంది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ అఘోరాగా నటించారు. ఆయన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. అదే విధంగా విక్రమ్ హీరోగా నటించిన తమిళ చిత్రం 'తంగలాన్'. పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో మాళవికా మోహనన్, పార్వతీ తిరువోతు కీలక పాత్రల్లో నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 2024 ఆగస్టు 15న తమిళంతో పాటు తెలుగులోనూ విడుదలైంది. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. ఈ సినిమాలో మరోసారి తన నట విశ్వరూపం చూపించారు విక్రమ్. ఇక 'గామి, తంగలాన్'లు 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ రోటర్‌డామ్ 2025' ప్రదర్శనకు ఎంపిక కావడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు.

పల్లెటూరి డిటెక్టివ్


● కిశోర్ శ్రీకృష్ణ, తనికెళ్ల భరణి, మిధున ప్రియ

తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో 'అసుర సంహారం' అనే చిత్రం రూపొందనుంది. కిశోర్ శ్రీకృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో మిధున ప్రియ కీలక పాత్ర చేయనున్నారు. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ల సమర్పణలో శ్రీ సాయి తేజో సెల్యులాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరీష్ బోయళ్ల నిర్మించనున్న ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు. 'క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ చిత్రాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాలకి ప్రేక్షకాదరణ ఉంటోంది. ఈ క్రమంలోనే విలేజ్ క్రైమ్ డ్రామాగా 'అసుర సంహారం' రూపొందనుంది. ఈ మూవీలో తనికెళ్ల భరణి విలేజ్ డిటెక్టివ్‌గా ఓ విభిన్నమైన పాత్రలో ప్రేక్షకులనూ అలరించనున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మిధున ప్రియ, కెమేరా: బాలు ఏబీసీడీ, సంగీతం: కరీం అబ్దుల్.

స్క్రీన్స్ పెరగడం ఆనందం


– విష్ణువర్ధన్

ఆకాశ్ మురళి, అదితీ శంకర్ జంటగా 'పంజా' ఫేమ్ విష్ణువర్ధన్ దర్శకత్వంలో రూపొందిన తమిళ సినిమా 'నెసిప్పాయ'. ఈ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 14న విడుదలైంది. ఈ సినిమాను 'ప్రేమిస్తావా' టైటిల్‌తో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ జనవరి 31న తెలుగులో విడుదల చేసింది. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో ఆకాశ్ మురళి మాట్లాడుతూ–''తెలుగు పరిశ్రమకు నన్ను ఆహ్వానించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''రిలేషన్‌షిప్ నేపథ్యంలో జరిగే రొమాంటిక్ డ్రామా ఇది. ఈ సినిమాలోని క్రైమ్ ఎలిమెంట్ అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తుంది. ఆకాశ్ ప్రతిభగలవాడు. యాక్షన్ స్టంట్స్‌ను కూడా తనే చేశాడు. అదితి అద్భుతంగా నటించింది. 'ప్రేమిస్తావా' సినిమాకు స్క్రీన్స్ పెరుగుతున్నాయని మైత్రీవారు చెప్పడం హ్యాపీగా ఉంది'' అని చెప్పారు విష్ణువర్ధన్. ''ఈ సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు సహనిర్మాత స్నేహ.


● విష్ణువర్ధన్, ఆకాశ్ మురళి, స్నేహ

సస్పెన్స్

రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'వైఫ్ ఆఫ్ అనిర్వేష్'. గంగ సప్తశిఖర దర్శకత్వం వహించారు. మహేంద్ర గజేంద్ర సమర్పణలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మించారు. ఈ సినిమా ఎస్‌కేఎంఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కానుంది. ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో రూపొందిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మంచి విజయం సాధిస్తుంది'' అన్నారు. వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర మాట్లాడుతూ–''ఓ మిమిక్రీ ఆర్టిస్ట్ తన ఇబ్బందులను తనకు తెలిసిన కళతో ఎలా పరిష్కరించాడు? అనేది దర్శకుడు ఆసక్తిగా తెరకెక్కించారు'' అని తెలిపారు.


● ఆర్పీ పట్నాయక్, సురేష్

సూర్యాపేట్ నేపథ్యంలో....


'కొత్తగా మా ప్రయాణం' మూవీ ఫేమ్ ఈశ్వర్ హీరోగా, నైనా సర్వర్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. రాజేశ్ నాదెండ్ల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అభిమన్యు సింగ్ ప్రధాన పాత్ర పోషించారు. అనిల్‌కుమార్ కాట్రగడ్డ, ఎన్. శ్రీనివాసరావు నిర్మించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో ఈశ్వర్ మాట్లాడుతూ– ''సూర్యాపేట్ జంక్షన్'కి నేను కథ రాశాను. సూర్యాపేట పరిసరాల్లో జరిగే కథ ఇది. ప్రభుత్వం నుంచి ఉచితాలు తీసుకోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లో ఇరుక్కుంటున్నారో మా చిత్రంలో చూపిస్తున్నాం'' అన్నారు. ''మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రోషన్ సాలూరి, గౌర హరి మంచి సంగీతం ఇచ్చారు'' అన్నారు అనిల్ కుమార్.


● ఈశ్వర్, నైనా

ఓటీటీ ఇది చూడొచ్చు

చూసి తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో బాలీవుడ్ చిత్రం ది రోషన్స్ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఈ జీవితమనే చక్రంలో కొందరి వంతు వస్తుంది, కొందరి వంతు ముగుస్తుంది. ముగిసిన వారి జ్ఞాపకాలు మన మనసులో పదిలంగా ఉంటాయి. వారిలో ఎందరో మహానుభావులుంటారు. వారి జ్ఞాపకాలైతే మనం నెమరువేసుకోవచ్చేమో కానీ ఆ కాలంలో వారు పడ్డ కష్టం, ఆనందం కానీ మనకు తెలియవు. అటువంటి వారి జీవిత చక్రానికి వెండితెర రూపమిస్తే మన ఆనందం అవధులు దాటుతుంది. ఆ కోవకు చెందినదే నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమ్ అవుతున్న 'ది రోషన్స్' టీవీ షో. ఇదో డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి జీవిత చక్రాలకు తెర రూపమే ఈ షో. బాలీవుడ్ దిగ్గజ రోషన్ కుటుంబానికి చెందిన నాటి సంగీత కళాకారులు రోషన్ లాల్ నాగ్రత్ నుండి నేటి తరం నటుడు హృతిక్ రోషన్ వరకు... వారి జీవిత ప్రయాణాన్ని ఎంతో అందంగా చూపించారు ఈ డాక్యుమెంటరీలో. ఓ రకంగా చెప్పాలంటే మనం ఈ షో ద్వారా నాలుగు తరాలు ప్రయాణిస్తాం. ముందుగా రోషన్ కుటుంబం నుండి రోషన్ లాల్ నాగ్రత్ సంగీత ప్రయాణంతో ఈ షో ప్రారంభమై ఆ పై అతని కొడుకు రాజేష్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో సాగి, ఆ తరువాత ఆయన కొడుకు రాకేశ్ రోషన్ నటనా ప్రయాణంతో పాటు ప్రొడ్యూసర్‌గా ఎలా రాణించారు? అన్నది చూపిస్తూ నేటి తరం కథానాయకుడు హృతిక్ రోషన్ బాలీవుడ్ ప్రయాణంతో షో ముగుస్తుంది. ఈ షో ద్వారా నాటి బాలీవుడ్ సంగీతం నుంచి నేటి తరం సినిమాల వరకు మనకు తెలియని ఎన్నో రహస్యాలతో పాటు హిందీ చిత్ర పరిశ్రమలోని అప్పటి ఒడిదుడుకులను ఇప్పటి పట్టు విడుపులను సవివరంగా చూపించారు. ఈ రోషన్ కుటుంబానికి బాలీవుడ్ పరిశ్రమలో ఉన్న నాటి, నేటి దిగ్గజాలు తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రేక్షకులకు చెప్పడం మరింత బావుంది. అందుకే 'ది రోషన్స్' చూసి నేర్చుకోదగ్గ, తెలుసుకోదగ్గ డాక్యుమెంటరీ. ఇది ప్రతి సినిమా ప్రేక్షకుడు తమ వ్యక్తిగత లైబ్రరీలో భద్రపరుచుకోదగ్గ డాక్యుమెంటెడ్ మినీ సిరీస్. వర్త్‌ఫుల్ టు వాచ్.

– ఇంటూరు హరికృష్ణ